క్లుప్తంగా

రేపు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కమిటీ ఎన్నిక

తుంగతుర్తి : రిటైర్డ్ ఉద్యోగుల సంఘం తుంగతుర్తి కమిటీ ఎన్నిక ఈ నెల 10న నిర్వహించనున్నట్లు సంఘం మండలాధ్యక్షుడు పి.సంతోష్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తుంగతుర్తిలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో నిర్వహించే సంఘం సర్వసభ్య సమావేశంలో కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. సమావేశానికి మండల యూనిట్ సభ్యులు హాజరు కావాలని కోరారు. ఆయన వెంట సంఘం మండల కార్యదర్శి పుల్లయ్య ఉన్నారు.

దామోదర్‌రెడ్డి చిత్ర పటానికి నివాళి



దామోదర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలగిరి(తుంగతుర్తి) : మాజీ మంత్రి రామ్‌రెడ్డి దామోదర్‌రెడ్డి మృతికి పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు.బుధవారం తిరుమలగిరి మండల కాంగ్రెస్ నాయకులు, అభిమానులు తుంగతుర్తిలోని దామోదర్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సర్వోత్తమ్‌రెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో సంకేపల్లి కొండల్‌రెడ్డి, వై.నరేశ్, జమీలాల్, వీరేశ్, అంబేద్కర్, సుధాకర్, వంశీ, సాయి పాల్గొన్నారు.

ఇన్‌చార్జి హెచ్‌ఎంకు సన్మానం



ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం జడ్పీహెచ్‌ఎస్ ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.చినవెంకట్‌రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన సభను బుధవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఈఓ బాలూనాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ కుంభం వెంకటరమణ, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు దండుగుల యల్లయ్య, ఇన్‌చార్జి హెచ్‌ఎం మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. అందరికీ యూరియా



అర్వపల్లి పీఏసీఎస్ వద్ద పోలీసు బందోబస్తు మధ్య యూరియా సరఫరా చేస్తున్న సిబ్బంది

అర్వపల్లి: రైతులు ఆందోళన పడొద్దని, అందరికీ యూరియా అందుతుందని మండల వ్యవసాయ అధికారి పెండోట గణేశ్ తెలిపారు. బుధవారం అర్వపల్లిలోని పీఏసీఎస్, మన గ్రోమోర్‌కు 1,300బస్తాల యూరియా రాగా రైతులందరికీ సరఫరా చేసినట్లు చెప్పారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున అందించినట్లు చెప్పారు. యూరియా పంపిణీ సందర్భంగా కేంద్రాల వద్ద రైతులు ఇబ్బంది పడకుండా ఎస్‌ఐ ఈట సైదులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

15న ఏసోబు సంతాప సభ

చివ్వెంల(సూర్యాపేట) : చివ్వెంల మండల తొలి ఎంపీపీ ఇట్టమళ్ల ఏసోబ్ సంతాప సభను ఈ నెల 15న చివ్వెంలలో నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, మల్లు నాగార్జున్ రెడ్డి హాజరు కానున్నట్లు చెప్పారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు



అర్వపల్లిలో నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాట్లు

అర్వపల్లి: జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికల నామినేషన్ స్వీకరణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అందుకు గానూ బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకంగా గదిని కేటాయించి సామగ్రి సమకూర్చారు. మండలంలో ఒక జడ్పీటీసీ, 8 ఎంపీటీసీల స్థానాలకు గురువారం నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. అందుకు గానూ తగిన సిబ్బందిని సైతం కేటాయించారు.

ఓపెన్ జిమ్..జామ్..!



మాచారంలో ఓపెన్ జిమ్ ప్రాంతంలో పెరిగిన కంపచెట్లు

- విరిగిన పరికరాలు, ఊడిన విడి భాగాలు
- దెబ్బతిన్న ప్లాట్‌ఫామ్
- కంపచెట్లతో నిండిన పరిసర ప్రాంతాలు

పెన్‌పహాడ్ : గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు ప్రస్తుతం జామ్ అయ్యాయి. దాంతో ఉదయమే వ్యాయామం చేసేందుకు వీలు లేక క్రీడాకారులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలకు సర్వీసింగ్ లేక పోవడంతో అవన్నీ విరిగి పోయాయి. కొన్ని పరికరాల విడిభాగాలు ఊడి పడి తుప్పు పడుతున్నాయి. మరి కొన్ని దొంగల పాలవుతున్నాయి.

లక్షల వ్యయంతో

పెన్‌పహాడ్ మండలంలోని అనంతారం, మాచారం, పెన్‌పహాడ్, దోసపహాడ్, భక్తాళాపురం, గాజులమల్కాపురం గ్రామాల్లోని పాఠశాల మైదానాలు, బహిరంగ ప్రదేశాల్లో లక్షల రూపాయల వ్యయంతో గత ప్రభుత్వ హయాంలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు కొంతకాలం వీటిని వినియోగించుకున్నారు. ఆ తర్వాత ఓపెన్ జిమ్‌ల పర్యవేక్షణ, నిర్వహణను పట్టించుకోక పోవడంతో వ్యాయామ పరికరాలు దెబ్బతిన్నాయి. చాలా వాటి పార్ట్‌లు విడిపోయి ఎక్సర్‌సైజ్ చేసేందుకు పనికి రాకుండా పోయాయి. దాంతో ప్రస్తుతం అవన్నీ నిరుపయోగంగా మారాయి.

> **మరమ్మతు చేయించాలి**
>
> ఓపెన్ జిమ్ పరికరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వాటికి మరమ్మతులు చేయించాలి. వాటిని ఎవరూ పట్టించుకోక పోవడంతో మొత్తం విరిగి పోతున్నయ్. అధికారులు శిక్షకుడిని కూడా ఏర్పాటు చేయాలి.
>
> – సైదయ్య, మాచారం
>
> **జిమ్ పరికరాలను పర్యవేక్షించాలి**
>
> ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసిన తర్వాత వాటి మెయింటేనెన్స్‌ను పట్టించుకోక నిర్లక్ష్యంగా వదిలేశారు. దాంతో పరికరాలు దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా వాటికి మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తేవాలి. ఓపెన్ జిమ్‌ల పర్యవేక్షణకు చర్యలు తీసుకోవాలి.
>
> – రమేశ్, అనంతారం

పరికరాలు ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫామ్ పూర్తిగా దెబ్బతిని కంపచెట్లు మొలుస్తున్నాయి.

నెరవేరని లక్ష్యం

గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు ప్రస్తుతం పని చేయక పోవడంతో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదు. దాంతో వ్యాయామం చేయాలనుకున్న వారు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం వల్లే వాటి పరిస్థితి దయనీయంగా మారిందని పేర్కొంటున్నారు. అధికారులు ఓపెన్ జిమ్ పరికరాలకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

రౌడీయిజం చేస్తే పీడీ యాక్ట్

- ఎస్పీ నరసింహ
- పట్టణ పోలీస్ స్టేషన్ తనిఖీ



పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : రౌడీ షీటర్స్‌పై పటిష్ట నిఘా ఉందని, దౌర్జన్యాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎస్పీ కె. నరసింహ హెచ్చరించారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. విధి నిర్వహణలో అనుసరించాల్సిన నియమాలపై సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ ఆవరణంలో మొక్క నాటారు. అనంతరం వివిధ అంశాలపై పోలీసు అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇతరులపై భౌతిక దాడులు, దౌర్జన్యాలకు పాల్పడితే రౌడీ షీట్స్ నమోదు చేస్తామని, పీడీయాక్ట్ పెట్టి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. పోలీసులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ షీ టీంలు జిల్లా కేంద్రంలో నిత్యం నిఘా ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. ఎవరైనా మహిళలతో అసభ్యకరంగా పరవర్తించిన వారిపై కేసు నమోదు చేయడం, కౌన్సిలింగ్ ఇవ్వడం చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలోని అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ×నేను సైతం× కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆయన వెంట డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ వెంకటయ్య, ఎస్‌ఐలు శివ తేజ, మహేంద్ర నాథ్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సిబ్బంది ఉన్నారు.

సీజేఐపై దాడి హేయం

- దుండగుడిని కఠినంగా శిక్షించాలి
- వివిధ సంఘాల నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి హేయమైనదని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములు మాదిగ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో ఏనాడూ జరగని విధంగా ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసిరి అవమానం చేసే ప్రయత్నాన్ని ఆయన ఖండించారు. ఇలాంటి చర్యకు పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు మల్సూర్, మండలాధ్యక్షుడు బొల్లె అశోక్, నాయకులు పాల్గొన్నారు.

నల్లజెండాలతో నిరసన

సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై మతోన్మాదులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య తెలిపారు. బుధవారం మండలంలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత ప్రధాన న్యాయమూర్తి మీద జరిగిన దాడి దేశంలో పెరుగుతున్న దళిత వ్యతిరేక ధోరణికి నిదర్శనమన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ పోషిస్తున్న అగ్రకుల మతోన్మాదాన్ని తీవ్రంగా ఖండించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ మండల నాయకులు చెవుల నాగరాజు, పీఓడబ్ల్యూఓ జిల్లా కార్యదర్శి కంచర్ల నర్సక్క, పిడమర్తి జాని, లింగరాజు, సుజిత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడి మృతి



లచ్చయ్య(ఫైల్)

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వద్దిగళ్ల లచ్చయ్య (76) బుధవారం మృతి చెందారు. లచ్చయ్య దామోదర్‌రెడ్డి వీరాభిమాని. ఆర్‌డీఆర్ మృతి చెందినప్పటి నుంచి తీవ్ర మనస్థాపంతో ఉన్న ఆయన ఇవాళ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- ఆర్డీఓ వేణుమాధవ్



నూతనకల్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ

నూతనకల్ : ఎంజాయ్‌మెంట్ సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ వేణుమాధవ్ ఆదేశించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న సర్వేను బుధవారం ఆయన తనిఖీ చేశారు. జెన్నారెడ్డి దేశ్‌ముఖ్ కుటుంబ సభ్యుల నుంచి భూములను కొనుగోలు చేసి నేటికీ పట్టాలు కాకుండా కాసులో ఉన్న రైతులను గుర్తించి భూ విస్తీర్ణాన్ని తేల్చేందుకు ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సర్వే నంబర్‌లోని భూ విస్తీర్ణాన్ని పూర్తిస్థాయిలో నిర్ధారించడంతో పాటు రైతుల వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన సాదాబైనామాల రెగ్యులరైజేషన్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. గ్రామాల వారీగా దరఖాస్తులను పరిశీలించి వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, డీటీ వంశీరాజ్, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణానికి లాభం

చివ్వెంల(సూర్యాపేట)/పెన్‌పహాడ్ : రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని సామాజిక కార్యకర్త డాక్టర్ మొల్గూరి గోపి అన్నారు. బుధవారం చివ్వెంల, పెన్‌పహాడ్ మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో చేపట్టిన రైతు చైతన్య యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాగులో అనేక మార్పులు వచ్చాయని, దాంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, రసాయనిక ఎరువులతో సేద్యం వల్ల నేలసారం దెబ్బతిన్నదని చెప్పారు. నేల సారాన్ని రక్షించుకోవాలని కోరారు. ప్రతి కుటుంబం తమ ఆరోగ్య అవసరా కోసం అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. సహజ సిద్ధ పద్ధతులతో చీడపీడల నివారణపై రైతులకు అవగహన కల్పించారు.

పాఠశాలకు డెస్క్ బెంచీలు

పెన్‌పహాడ్ : మండలంలోని మాచారం ప్రాథమిక పాఠశాలకు రూ.25 వేల విలువైన డ్యూవల్ డెస్క్ బెంచీలను అదే గ్రామానికి చెందిన గెల్లా పుండరీ జ్ఞాపకార్థం ఆయన భార్య చంద్రకళ బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నకిరేకంటి రవి ఆధ్వర్యంలో దాతను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని బాగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దాతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలి

- ఆర్డీఓ శ్రీనివాసులు



సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

హుజూర్‌నగర్ : సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) వారోత్సవాల్లో భాగంగా బుధవారం హుజూర్‌నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌టీఐపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజలు సమాచార హక్కు చట్టం ద్వారా అడిగిన సమాచారాన్ని అధికారులు అందించాలని చెప్పారు. ప్రతిఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని, దానిని దుర్వినియోగం చేయవద్దని అన్నారు. ప్రతిఒక్కరూ చట్టం స్ఫూర్తిని, దాని ప్రాముఖ్యతను కాపాడాలని ఆయన కోరారు. అనంతరం చట్టం పూర్తి స్థాయిలో అమలు జరిగేలా చూడాలని కోరుతూ పలువురు ఆర్డీఓకు వినతిపత్రాలు అందజేశారు.

మహిళల భద్రతే షీ టీమ్ లక్ష్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నూతనకల్ : బాలికలు, మహిళల భద్రతే లక్ష్యంగా షీ టీమ్ పనిచేస్తుందని ఎస్‌ఐలు నాగరాజు, నీలిమ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు షీటీమ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకతాయిలు ఇబ్బంది పెడితే వెంటనే షీ టీమ్ టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాలికలు ప్రభుత్వం అందిస్తున్న విద్యా, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానానికి ఎదుగాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం. రాములునాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళాజాతా

తుంగతుర్తి: యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలు కావద్దని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి శ్రీకాంత్‌గౌడ్ కోరారు. బుధవారం మండలంలోని గాజులగూడంలో కళాజాతా ప్రదర్శన నిర్వహించి డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు. పాన్ మసాలా, గుట్కా, నాటు సారా నిషేధం వంటి వాటిపై ప్రజలకు కళారూపాల ద్వారా అవగాహన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సారథి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెల రాము, టీం లీడర్ పల్లెల లక్ష్మణ్, కళాకారులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపు లైసెన్స్ రద్దు



షాపులో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ దివ్య

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : మండలంలోని తుమ్మల పెన్ పహాడ్ గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మి గణేష్ ఫర్టిలైజర్ దుకాణం లైసెన్స్‌ను రద్దు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి దివ్య తెలిపారు. షాప్ యజమాని అధికారులకు సమాచారం ఇవ్వకుండా బుధవారం యూరియాను పంపిణీ చేయడంతో పాటు యూరియా బస్తాను అధిక ధరకు విక్రయించినట్లు గ్రామస్తులు వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఏఓ దివ్య షాపును తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమాచారం సేకరించారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలుపగా వారి ఆదేశాల మేరకు సదరు ఫర్టిలైజర్ షాపు లైసెన్స్‌ను రద్దు చేసినట్లు ఆమె తెలిపారు.

చిరుధాన్యాలలో పోషకాలు మెండు



హుజూర్‌నగర్ : గర్భిణులు, బాలింతలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏసీడీపీఓ శ్రీలిఖిత

హుజూర్‌నగర్ : చిరుధాన్యాలలో పోషకాలు మెండుగా ఉంటాయని ఏసీడీపీఓ శ్రీలిఖిత అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలని చెప్పారు. అంతేకాకుండా పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే పిల్లలు ఆరోగ్యంవంతులుగా ఉంటారని ఆమె పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిరుధాన్యాలు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సోవమ్మ, అంగన్‌వాడీ టీచర్ షహజాది బేగం, ఏఎన్‌ఎం లలిత, ఆయా పద్మ ఆశా వర్కర్లు, గర్భిణులు బాలింతలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.


ముర్రుపాలతో బిడ్డకు ఆరోగ్యం

నేరేడుచర్ల : బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టిస్తే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.రాజ్యలక్ష్మి అన్నారు. మున్సిపాలిటీలోని రామాపురంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా తల్లులు, చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ టీచర్ ఆర్.ప్రీతి, ఎ.అన్నమ్మ, ఆశా వర్కర్ విజయరాణి పాల్గొన్నారు.

డిజిటల్ లెర్నింగ్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

హుజూర్‌నగర్ : ఉపాధ్యాయులు డిజిటల్ లెర్నింగ్‌పై శిక్షణ పొంది విద్యార్థులకు బోధన చేయాలని ఎంఈఓ సైదానాయక్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని గురుకుల పాఠశాలలో డివిజన్ గణిత, భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు డిజిటల్ లెర్నింగ్ బోధనపై నిర్వహిస్తున్న శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి, రిసోర్స్ పర్సన్‌లు, సీఆర్‌పీలు డివిజన్‌లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలకు పాఠాలు వంటబట్టేలా..



ఏఆర్, వీఆర్ బోధనా సామగ్రి

- పీఎంశ్రీ పాఠశాలలకు బోధనా పరికరాలు
- అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్ రూ.10 లక్షలతో సామగ్రి

అర్వపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకానికి ఎంపికైంది. దాంతో పాఠశాలలో ఉత్తమ విద్యాబోధనకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే పీఎంశ్రీ కింద పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించారు. ఏఆర్, వీఆర్ బోధన కోసం ప్రత్యేక సామగ్రిని ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయి డిజిటల్ సాంకేతికతతో కూడిన ఆగ్మెంటేషన్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ బోధన అందించనున్నారు. ఇందుకు గానూ సుమారు రూ.10 లక్షల విలువైన పరికరాలను సమకూర్చారు.

పాఠశాలకు వచ్చిన పరికరాలు

పీఎంశ్రీ పథకంలో భాగంగా ఏఆర్, వీఆర్ బోధనకు గానూ 10 హెడ్‌సెట్లు, ఒక కంప్యూటర్, చార్జింగ్ ట్రాలీ, 10 బీన్‌బాగ్స్, టీచర్స్ ట్రైనింగ్‌కు సంబంధించిన పరికరాలు వచ్చాయి. వీటి ఆధారంగా 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రతిరోజూ పాఠాలు బోధించనున్నారు. వర్చువల్ రియాలిటీలో భాగంగా విద్యార్థులు కళ్లకు డివైజ్ పెట్టుకొని చూడటం, పాఠ్యాంశాలు వినడం వల్ల అవి సులువుగా అర్థం కావడంతో పాటు ఆ పాఠం ఎప్పటికీ గుర్తుండి పోతుంది. పాఠశాలలో ఈ విధానం త్వరలో అమలు కానుంది.

> **పీఎంశ్రీతో పాఠశాల అభివృద్ధి**
>
> 
>
> పీఎంశ్రీతో పాఠశాల అభివృద్ధికి నిధులు వస్తున్నాయి. దాంతో పాటు అనేక కార్యక్రమాలు అమలవుతున్నాయి. కొత్తగా ఏఆర్, వీఆర్ బోధనకు పరికరాలు సైతం వచ్చాయి. ఈ విధానం త్వరలో ప్రారంభం కానుంది. దాంతో పాటు సంగీత పరికరాలు కూడా వచ్చాయి. వీటికి సంబంధించిన టీచర్ రాగానే పాఠాలు మొదలు పెడతాం.
>
> – ఎం. విజయలక్ష్మి, హెచ్‌ఎం

నిరుపేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు

హుజూర్‌నగర్ : నిరుపేద విద్యార్థులకు తమ సంస్థ ద్వారా నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్ పాలెల్లి నరేష్ తెలిపారు. హుజూర్‌నగర్‌లోని 2వ వార్డుకు చెందిన బీటెక్ విద్యార్థి మరికంటి సంకీర్తనకు రూ.30 వేల చెక్కును బుధవారం మాజీ కౌన్సిలర్ అట్లూరి మంజుల హరిబాబుతో కలిసి ఆయన అందజేశారు. ఎంపిక చేసిన నిరుపేద విద్యార్థులకు బీటెక్‌లోఏటా రూ 30 వేల చొప్పున నాలుగేళ్లకు రూ 1.20 లక్షల ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు.



విద్యార్థికి చెక్కు అందిస్తున్న ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్, మాజీ కౌన్సిలర్

ఉధృతంగా మూసీ



జాజిరెడ్డిగూడెం వద్ద మూసీనది పరవళ్లు

అర్వపల్లి: హైదరాబాద్‌తో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మూసీలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. బుధవారం మండలంలోని జాజిరెడ్డిగూడెం శివారులో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది.ఈ వానకాలం సీజన్ ప్రారంభం నుంచి మూసీకి భారీగా వరద వస్తోంది.దాంతో పాటు హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసిన ప్రతిసారీ వరద తాకిడి పెరగడంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది.